సమ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే



4లో..



www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily



ఏజెన్సీ ప్రాంతంలో 'పవర్ పెట్రోల్' మోత!



3వ పేజీల్లో



హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 216, ఆదివారం 6-9-2026 ఎడిటర్ : చెంగపాంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam


# ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా?

## ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు... వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు

**సీట్లు పెరిగితే 117 గెలుస్తాం**

**ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం**

**కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?**

**నకిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి**

**వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**

ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.



# కేబినెట్ మార్పు చేర్పులకు కసరత్తు!?

**అసెంబ్లీ సమావేశాలు ముగియగానే కార్యాచరణ**

**ప్రస్తుతం కేబినెట్‌లో మూడు ఖాళీలు**

**నామినేటెడ్ పదవులు కూడా ఒకే సారి భర్తీ**

**సరిగ్గా పని చేయని వారికి తప్పని ఉద్వాసన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో అత్యంత కీలకమైన రాజకీయ ఘట్టానికి తెరలేపుతోంది. మంత్రివర్గంలో మార్పుచేర్పులు ,ఖాళీల భర్తీ ప్రక్రియను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి తుది అనుమతి లభించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగియగానే ఈ విస్తరణ ప్రక్రియను పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ పరిణామం కేవలం పదవుల పెంపకానికే పరిమితం కాకుండా, పార్టీపై , పాలనపై సీఎం తన పట్టును మరింత బిగించే ప్రక్రియగా కనిపిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ కేబినెట్‌లో సాంకేతికంగా ఖాళీలు ఏర్పడగా, కొండా సురేఖ బర్తరఫ్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రాతినిధ్యంతో పాటు బీసీ మహిళా స్థానం ఖాళీ అయింది. అంటే ప్రస్తుతం మూడు ఖాళీలు ఉన్నాయి. దీంతో పాటు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రాతినిధ్యాన్ని కల్పించడం సీఎం రేవంత్ ముందున్న ప్రధాన లక్ష్యం. మూడేసి ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, పనితీరు సరిగ్గా లేని కొంతమంది మంత్రుల శాఖలను మార్చడం లేదా వారి స్థానంలో నూతన ముఖాలకు అవకాశం కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రణాళిక సిద్ధమైంది. కొండా సురేఖను తప్పించిన వెంటనే, నష్ట నివారణ చర్యల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ముగ్గురు కీలక బీసీ మహిళా నేతలకు ఉన్నతమైన నామినేటెడ్ ..మిగతా 2లో



## తెలంగాణ గవర్నర్‌ను కలిసిన ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డి. రాజి రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5:**

శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ డి. రాజి రెడ్డి తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ను గవర్నర్ భవన్ లో కలిశారు. ఈ సందర్భంగా అక్టోబర్ లో నిర్వహించనున్న విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి సంబంధించిన అంశాలపై విన్నవించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఉద్యాన రంగం తీరు తెన్నులపై గవర్నర్ కు వివరించారు . ఉద్యాన రంగంలో ఆధునిక టెక్నాలజీ వినియోగం, నూతన అంశాల పరిశోధన, విద్యా విధానాలను వైస్ ఛాన్సలర్ గవర్నర్ కు తెలిపారు. వర్సిటీ ప్రచారాలను గవర్నర్ కు వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. భగవాన్ ఉన్నారు.

### శ్రీకృష్ణ స్వామి వారి ఆశీస్సులతో ఈ సంవత్సరం సమృద్ధిగా

# వర్షాలు కురిసి రైతాంగం ఆనందంగా ఉండాలి: ఎంపీడీకే అరుణ

**సద్దలోనిపల్లి శ్రీకృష్ణ స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే. అరుణమ్మ..**





**గద్వాల, సెప్టెంబర్ 5 :**

శ్రీకృష్ణ స్వామి వారి ఆశీస్సులతో ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం ఆనందంగా ఉండాలని మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ అన్నారు. శనివారం మల్దకల్ మండలంలోని సద్దలోనిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె. అరుణమ్మ , జిల్లా యువ నాయకురాలు డీకే. స్నిగ్ధ రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డికె. అరుణమ్మ మాట్లాడుతూ..శ్రీకృష్ణ స్వామి వారి ఆశీస్సులతో ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం ఆనందంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలు సుభిక్షంగా ఉండి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని స్వామి వారిని ప్రార్థించారు.రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు, మల్దకల్ మండల నాయకులు ,కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

# రైతన్న కంట కన్నీరు రేవంత్ పాలనకు నిదర్శనం

**రైతుల భూములపై 22ఏ నిషేధం ఎత్తివేయాలి..**

**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే బర్తరఫ్ చేయాలి**

**రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు**

**పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**గుమ్మడిదలలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతన్న పోరుబాట..**





**పటాన్ చెరు, సెప్టెంబర్ 5 :**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెయ్యి రోజుల పాలనలో వ్యవసాయ రంగం విధ్వంసం కావడంతోపాటు.. రైతన్న పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 మోసాల పైన బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరు బాటలో భాగంగా శనివారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతన్న పోరు బాట కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో విప్లవత్మక మార్పులు తీసుకొని రావడంతో పాటు రైతుని రాజు చేస్తానంటూ ప్రగల్బాలు పలికి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. రైతుబంధు, రైతు బీమా వంటి విప్లవాత్మక పథకాలకు చరమగీతం పాడడంతో పాటు కనీస మద్దతు ధర అందించక రైతన్న పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 సంవత్సరాలు పోరాడిన కేసీఆర్.. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు.మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించడంతో పాటు రైతులకు రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ అందించి వ్యవసాయ రంగానికి అండగా నిలిచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు విద్యుత్ సమస్యల కారణంగా పొలాల్లో మోటార్లు ఆన్ చేసేందుకు వెళ్లిన రైతులు పాముకాట్లకు, ఇతర ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయని, ఆ పరిస్థితులను మార్చేందుకు 24 గంటల విద్యుత్ సరఫరా తీసుకొచ్చిన మహోన్నత నాయకుడు కెసిఆర్ అని గుర్తు చేశారు.

**22ఏ పేరుతో రైతులను వేధించడం సరికాదు**

ప్రస్తుతం జిన్నారం, గుమ్మడిదల తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆరోపించారు. రైతుల భూములను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి వారిని మానసికంగా, ఆర్థికంగా వేధించడం తగదన్నారు.

రైతుల భూముల విషయంలో జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై బాధ్యత వహించి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పదవి నుంచి తప్పుకోవాలని, లేకపోతే ముఖ్యమంత్రి ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, పరిశ్రమల కోసం కేటాయించిన భూముల విషయంలోనూ అనేక సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే ..మిగతా 2లో



# 'ఇస్రో'ను నామమాత్రం చెస్తారా?

**- మొత్తం ప్రైవేటుకే ధారాదత్తమా?**

**- తొలిసారి ఉద్యోగుల తీవ్ర అసంతృప్తి**

**బెంగళూరు, సెప్టెంబరు 5:** ఇస్రోలో ప్రైవేటు భాగస్వామ్యంపై ఉద్యోగులు తొలిసారి అసంతృప్తి గళమెత్తారు. వాస్తవానికి ఆరేళ్ల కిందటే అంతరిక్ష రంగంలో ప్రైవేటు పెట్టుబడులు ప్రారంభమయ్యాయి. అయితే.. ఇటీవల ఇస్రోలోని స్పేస్ ప్రమోషన్ విభాగం చైర్మన్ పవన్ గోయెంకా ఓ మీడియాతో మాట్లాడుతూ.. "ఇకపై ఎలాంటి ప్రయోగ వాహక నౌకలను రూపొందించం." అని వ్యాఖ్యానించారు. దీనిపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్‌లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 9ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం లేఖ రాశాయి. ప్రైవేటు భాగస్వామ్యం విషయంలో తాము వ్యతిరేకం కాదని, కానీ, ఇది నిర్దిష్ట వాణిజ్య కార్యకలాపాలకు మాత్రమే పరిమితం కావాలని సూచించాయి. ప్రయోగవాహక నౌకలను తయారు చేయకూడదన్న నిర్ణయం ఇస్రోను నామమాత్రం చేసి.. ఆర్ అండ్ డీకి పరిమితం చేయాలని భావిస్తున్నట్టుగా ఉందని లేఖలో ఉద్యోగులు పేర్కొన్నారు. భవిష్యత్తులో అంతరిక్ష కార్యకలాపాలు ఇస్రో పరిధిలోనే ఉంటాయో లేదో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో బాలికలకు ఉచిత సి.బి.పి పరీక్షలు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా:**

లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320+ ఆధ్వర్యంలో పాఠశాలలో, కళాశాలల్లో చదువుతున్న బాలికలకు ఉచిత సి.బి.పి పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రస్తుతం అనేక మంది బాలికలు లిహిమోగ్లోబిన్ లోపం (రక్తహీనత) లితో పాటు ఇతర రక్త సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, సరైన అవగాహన మరియు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల సమస్యలు గుర్తించబడకుండా ఉంటున్నాయి.ఈ నేపథ్యంలో బాలికల్లో రక్తహీనతను ముందుగానే గుర్తించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం మరియు అవసరమైన వారికి వైద్య సలహాలు అందించాలనే ఉద్దేశంతో లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320+ ఈ ఉచిత సి.బి.పి పరీక్షల కార్యక్రమం లయన్ అనంతుల శివ ప్రాసాద్ పూర్వపు జిల్లా గవర్నర్ , హనుమండ్ల రాజి రెడ్డి పూర్వ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ పుట్టిన రోజు సందర్భముగా శ్రీ సరస్వతీ శిశుమందిర్ లో




శ్రీకారం చుట్టింది.సి.బి.పి పరీక్షల ద్వారా హిమోగ్లోబిన్ స్థాయి , రక్తానికి సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలను ప్రాథమికంగా గుర్తించి, అవసరమైన బాలికలకు తదుపరి వైద్య పరీక్షలు, పోషకాహారం , చికిత్సపై తగిన మార్గదర్శకత్వం అందించనున్నారు."ఆరోగ్యవంతమైన బాలికలు -- ఆరోగ్యవంతమైన కుటుంబాలు -- ఆరోగ్యవంతమైన సమాజం" అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ రోజు న స్థానిక మహిళ డిగ్రీ , పిజి కళాశాలలో 130 విద్యార్థినులకు అలాగే శ్రీ



సరస్వతీ శిశుమందీర్ పాఠశాలలో 200 విద్యార్థినులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, బాలాజీ నగర్, శ్రీనిధి , స్మార్ట్ సిటీ సి.బి.పి పరీక్షలు చేసి రిపోర్ట్ అందజేసి తగు సలహాలు సూచనలు చేసారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా గవర్నర్ మోర భద్రేశం, ఉప గవర్నర్ గుంటుక చంద్ర ప్రకాష్, హనుమండ్ల రాజిరెడ్డి, డా ఎం ఎల్ ఎన్ రెడ్డి, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ , క్లబ్ ప్రెసిడెంట్స్ ఎమ్ గంగాధర్, ఆర్ ప్రభాకర్ రెడ్డి, బి రాజయ్య, పులాల శ్యామ్ మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# టీచర్స్ డే సందర్బంగా ఉపాధ్యాయులను సన్మానించిన బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ సుధీర్ కుమార్

**పటాన్ చెరు, సెప్టెంబర్5 :**

ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకుని ఉపాధ్యాయులకు ఐడిఎ బొల్లారం ఇన్స్పెక్టర్ సుధీర్ కుమార్ ఘనసన్మానం చేసి టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్బంగా బొల్లారం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్స్ డే సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లారం సీఐ సుధీర్ కుమార్ హాజరై పాఠశాల ప్రాధనోపాధ్యాయుడు మంగీలాల్, సీనియర్ ఉపాధ్యాయులు విక్టోరియా కి సన్మానం చేసారు.డాక్టర్ సర్వే పల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురష్కరించుకుని దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటామని సీఐ సుధీర్ కుమార్




విద్యార్థులకు తెలిపారు.మన భారతీయ సంప్రదాయంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత పూజనీయంగా భావించే వ్యక్తి గురువు. 'ఆచార్యదేవోభవ' అంటూ విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కీర్తిస్తాం. నిజం చెప్పుకోవాలంటే మన తల్లిదండ్రుల కంటే గురువులకే మన గురించి ఎక్కువ తెలుసనడంలో ఎలాంటి సందేహం లేదు. మన తెలివితేటలు, ఆలోచనల గురించి గురువులకే పూర్తిగా తెలుస్తుంది. చదువు మీద శ్రద్ధ తగ్గినట్టనిపించినా మనసు పక్కదారి పట్టినట్టు గుర్తించినా దండిస్తారని,సరైన దారిలో నడిపిస్తారని చెప్పారు. అందుకే గురువును మించిన దైవం లేదంటారు అని సీఐ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న కంట కన్నీరు రేవంత్ పాలనకు నిదర్శనం

మొదటి పేజీ తరువాయి...

పేర్కొన్నారు. రైతుల భూముల విషయంలో అక్రమాలు, మధ్యవర్తుల జోక్యం ఉంటే వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాల్సిన ప్రభుత్వం, ఉన్న భూములపైనే వివాదాలు సృష్టించడం సరికాదన్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. రైతులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేబినెట్ మార్పు చేర్పులకు కసరత్తు!?

మొదటి పేజీ తరువాయి...

పదవులను కట్టబెట్టడం ద్వారా తన సామాజిక వ్యూహాన్ని చాటుకున్నారు. కేబినెట్ హోదా కలిగిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా గద్వాల విజయలక్ష్మి , మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద , కుడా ఛైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి లను నియమించడం ద్వారా బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశామనే సంకేతాన్ని పంపించారు. ఇదే సూత్రాన్ని రాబోయే కేబినెట్ భర్తీలోనూ పాటిస్తూ ఒక బీసీ మహిళకు మంత్రిపీఠం దక్కేలా రేవంత్ ప్రణాళికలు రచిస్తున్నారు.

## శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**పటాన్ చెరు, సెప్టెంబర్ 5:**

శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, గొప్ప విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల కృతజ్ఞతను చాటుతూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఉపాధ్యాయులను సత్కరించి, వారి సేవలను కొనియాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు మరియు ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కొత్వాల్ హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, వారి జీవితానికి సరైన దిశను చూపించే మార్గదర్శి అని అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.అకడమిక్ డైరెక్టర్లు సింహాచలం, మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయుల కృషి అమూల్యమైనదని తెలిపారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.పాఠశాల ప్రిన్సిపల్ హరిప్రియ మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి ఒక ఉద్యోగం మాత్రమే కాదని, అది బాధ్యతతో కూడిన సేవ అని అన్నారు. విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు క్రమశిక్షణ, విలువలు, ఆత్మవిశ్వాసం మరియు మానవీయతను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు సింహాచలం, మహిపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ హరిప్రియ, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.






బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి



మాట్లాడుతున్న బిషప్ సామ్యూల్ ఫిన్నీ పచ్చిగల్ల

## రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ సేవలు మరువలేనివి

**బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి**

**బుద్వేల్, సెప్టెంబరు 5:**

యేసయ్య సేవ లో నమ్మకమైన పరిచర్య చేసిన వ్యక్తిగా రాజేంద్రనగర్ మన్నా చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ కు పేరుందని పలువురు వక్తలు గుర్తు చేసుకున్నారు. ఇటీవల గుండెపోటు తో మృతి చెందిన రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ భూ స్థాపన కార్యక్రమం శనివారం రాజేంద్రనగర్ సమాధుల తోట లో జరిగింది. అంతకు ముందు రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చిలో మన్నా మినిస్ట్రీస్ రీజినల్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ సీహెచ్ భాస్కర్ రావు, విజయనగరానికి చెందిన రెవరెండ్ డాక్టర్ ప్రేమానందం అధ్యక్షతన జరిగిన ప్రార్థన సమావేశాలలో మన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు బిషప్ రేచల్ జ్యోతి కామానపల్లి, భీమవరానికి చెందిన బిషప్ సామ్యూల్ ఫిన్ని పచ్చిగల్ల, మన్నా మినిస్ట్రీస్ కు చెందిన బిషప్ ఏం ఎలీషా రాజు (ఏలూరు) , బిషప్ పిల్లి పీటర్ (విశాఖపట్నం) లు మాట్లాడుతూ, 35 సంవత్సరాల పాటు యేసయ్య సేవ ను నమ్మకంగా చేసిన వ్యక్తి రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ అన్నారు. వాక్యానుసారంగా జీవించడం, తప్పును తప్పుగా ఖండించడం, ఏ విషయానైనా ముక్కుసూటిగా చెప్పే స్వభావం ఉన్న వ్యక్తి రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ అన్నారు. రాజేంద్రనగర్ లో అద్భుతమైన దేవుని సేవను జరిగించారని గుర్తు చేసుకున్నారు. జాన్మోజెస్ సతీమణి సిస్టర్ సీహెచ్ ప్రభావతి, కుమారులు జాన్ సామ్యూల్, జాన్ సుందర్ పాల్ లను పరమార్శించి వారికి ధైర్యం చెప్పారు. దేవుడు వారికి తోడుగా ఉండాలని ప్రార్థనలు చేశారు. ఈ సమావేశంలో ట్విన్ సిటీస్ పాస్టర్స్ ఫెలోషిప్, పెంతుకోస్థల్ పాస్టర్స్ ఫెలోషిప్, ప్రేయర్ పార్టనర్స్ నెట్వర్క్ ఇండియా, మన్నా, రాక్ చర్చి మినిస్ట్రీస్ ప్రతినిధులు రెవరెండ్ పి విజయ దీవన్, రెవరెండ్ డాక్టర్ మోహన్ బాబు, రెవరెండ్ ప్రసాద్ చౌదరి, రెవరెండ్ టీఎం కుమార్, రెవరెండ్ జోయల్ గుమ్మడి, రెవరెండ్, కిరణ్ పాల్, రెవరెండ్ డాక్టర్ నిరీక్షణ కుమార్, రెవరెండ్ డాక్టర్ కేవీ పాల్, రెవరెండ్ థెరెస్సా పాల్, రెవరెండ్ థామస్ కురియన్, రెవరెండ్ పీఎస్ డేవిడ్, రెవరెండ్ సంజీవ, రెవరెండ్ డాక్టర్ స్టీవెన్ సతీష్ పాల్, రెవరెండ్ డాక్టర్ జీఎస్ విజయ భూషణం, రెవరెండ్ డాక్టర్ ప్రేమానందం (విజయనగరం) ,, రెవరెండ్ జోషి కుమార్ (గంటి) , రెవరెండ్ సుందర్ పాల్, రెవరెండ్ కె నతానియల్, రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, రెవరెండ్ కరుణ్, లతో పాటు వందలాది మంది దైవ సేవకులు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రకు సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన సేవలు మరువలేనివి

**సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకల్లో బండి రమేష్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 5 :**

కూకట్ పల్లి నియోజకవర్గం, భరత్ నగర్‌లోని గవర్నమెంట్ పబ్లిక్ స్కూల్లో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యారంగ అభివృద్ధికి, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రకు సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏబీ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, ఏఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి, టెంపుల్ చైర్మన్ మూర్తి, వెంకటేష్ యాదవ్, బాలరాజు, క్రాంతి, రమణ, సంతోష్ తదితరులతో పాటు ఉపాధ్యాయులు రత్నారావు, లక్ష్మీ, రాజారావు మరియు పలువురు పాల్గొన్నారు.



## భూ భారతి పేరుతో భూముల హక్కులను హరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**భూముల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ నిరంతర పోరాటం చేస్తాం**

**బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 5 :**

భూ భారతి పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులకు చెందిన భూములను సెక్షన్ 22ఏ పరిధిలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన 'ఛలో ఇందిరాపార్క్--మహా దీక్ష' కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్ పాల్గొన్నారు. ప్రజల భూముల హక్కులను పరిరక్షించడంతో పాటు రైతులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు బీజేపీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఆయన ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలకు సంబంధించిన భూములపై హక్కులను కాపాడేందుకు బీజేపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని కంచి మహేందర్ పేర్కొన్నారు. పేదలు, రైతులు,మధ్యతరగతి కుటుంబాల భూ హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజల భూముల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ పార్టీ మోసపూరిత ఆరు గ్యారంటీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను నేడు వంచించింది

**ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**

**ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సక్రమంగా ఏ ఒక్కటి నెరవేర్చలేదు**

**ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు**

**ఇతర నియోజకవర్గాలకు చెందిన వారికి ఇళ్లు కేటాయించినట్లు ఆధారాలతో సహా చూపించేందుకు సిద్ధం**

**కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 5 :**

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనందుకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు మూసాపేట్ డివిజన్‌లో మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహం నుండి జనతా నగర్ చిత్తారమ్మ గుడి వరకు నిరసన ర్యాలీ పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా




హాజరై, నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత ఆరు గ్యారంటీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను నేడు ఆ పార్టీ పూర్తిగా వంచించిందని, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా నెరవేర్చలేకపోయిందని, మహాలక్ష్మి, చేయూత వంటి పథకాలన్నీ కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. రూ.4 వేల పింఛన్, ఇందిరమ్మ ఇళ్ల వంటి హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో మంత్రి పొంగులేటి అవకతవకలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే ఆరోపించారు. సొంత నియోజకవర్గానికి కాకుండా ఇతర నియోజకవర్గాలకు చెందిన వారికి ఇళ్లు కేటాయించినట్లు ఆధారాలతో సహా చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలైన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి, లేనిపక్షంలో ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటాలను మరింత ఉధృతం చేస్తుంది అని ఆయన హెచ్చరించారు. ఈ అసమర్థ ప్రభుత్వం నివాస గృహాలను 22 ఏ నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను పీడిస్తుందని ఆయన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త సతీష్ అరోరా, డివిజన్ మాజీ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి తిరుపతి, ముఖ్య నాయకులు, మహిళలు, యువకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు







**ఉమ్మడి కరీంనగర్ సెప్టెంబర్, 5:**

శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, పాటలు తదితర కార్యక్రమాలు నిర్వహించి ఉపాధ్యాయులను సత్కరించారు.పాఠశాల ప్రధానాచార్య మోర రణధీర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి, నైతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు.విద్యార్థులు మాట్లాడుతూ తమ జీవితాలకు దిశానిర్దేశం చేస్తున్న గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మానం చేసి, సర్టిఫికెట్ లు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, అప్పిడి వకుళా దేవి, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, మేచినేని దేవేందర్ రావు, కొత్తూరి ముకుందశీ, కొంజర్ల మహేష్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులల శ్యామ్, గట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అక్షరానికి ఆత్మబంధువు... విద్యార్థులకు మార్గదర్శి గురువు

**గచ్చిబౌలి జెడ్‌పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయుల సన్మానించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్**

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 5:**

తల్లి తొలి గురువైతే... అజ్ఞానపు చీకట్లను పారద్రోలి సన్మార్గంలో నడిపించే ఉపాధ్యాయుడే నిజమైన ప్రగతి ప్రదాత అని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గురువుల సేవలను కొనియాడుతూ పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఆయన ఘనంగా సత్కరించారు. సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అపారమైనదని సీపీ చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన అత్యంత ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉ





న్నారని తెలిపారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయులకు ఇచ్చే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు. క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, రోడ్డు భద్రత, డ్రగ్స్ రహిత సమాజం, సైబర్ భద్రతపై అవగాహన పెంచడంలో పోలీసులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**విద్యార్థులతో ముఖాముఖి సందేహాల నివృత్తి**

ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సీపీ ఎంతో ఓపికగా సమాధానమిచ్చారు: హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రతి ఒక్కరూ ధరించాలని, రోడ్డు భద్రత అందరి బాధ్యత అని సీపీ తెలిపారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ నిరంతరం రక్షణగా ఉంటాయని, ఆపదలో డయల్ 100 లేదా 112 ను సంప్రదించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎలాంటి సమాచారమున్నా పోలీసులకు తెలియజేయాలని కోరారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటిపీ బ్యాంక్ వివరాలు ఎట్టిపరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు.




గచ్చిబౌలిలోని జెడ్ పిహెచ్ స్కూల్లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిపి రమేష్ తో పాటు పోలీస్ అధికారులు..

**ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం**

ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన హెచ్‌ఎం రెహానా బేగం, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మునీర్ అహ్మద్‌లను సీపీ రమేష్ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం సీఐ భూపతి, ఇతర పోలీస్ అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నో మ్యాపింగ్ ఓటర్లు ధ్రువపత్రాలతో హియరింగ్‌కు హాజరుకావాలి

**– చుంచుపల్లి తాసీల్దార్ నాగరాజు**

**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 05 (భద్రాద్రి న్యూస్) :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల్లో ఇంటి పేరు ముందు, వెనుక ఉండడం, పేర్లలో స్పెల్లింగ్ తప్పులు, వయస్సులో తేడాలు వంటి చిన్నపాటి లోపాలపై ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చుంచుపల్లి తాసీల్దార్ నాగరాజు అన్నారు. శనివారం బాబు క్యాంప్ పంచాయితీలో నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2002 ఓటరు జాబితాలోని వివరాలను ప్రస్తుత వివరాలతో పోల్చి, ఓటర్ల వద్ద ఉన్న సంబంధిత ధ్రువపత్రాలను బీఎల్ఓ స్థాయిలోనే పరిశీలించి అవసరమైన సవరణలు చేస్తామని తెలిపారు. ఇలాంటి తేడాల వల్ల ఓటు హక్కుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. నో మ్యాపింగ్ ఓటర్లు 2002లో ఓటు ఉండి ప్రస్తుతం మ్యాపింగ్ కానివారు, సంబంధిత వివరాలు సమర్పించని వారికి హియరింగ్‌లో అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. 1987 జూలై 1 కంటే ముందు జన్మించిన వారు గతంలో సూచించిన 13 రకాల ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పిస్తే సరిపోతుందని తెలిపారు. 1987 జూలై 1 నుంచి 2004 మధ్య జన్మించిన వారు తమ ధ్రువపత్రాలతో పాటు తల్లి లేదా తండ్రికి సంబంధించిన ధ్రువపత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ఓటర్లు తమకు అందిన నోటీసుకు అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి, కేటాయించిన హియరింగ్ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య హాజరై సమర్పించవచ్చున్నారు. ఓటరు స్వయంగా రాలేని పరిస్థితిలో కుటుంబ సభ్యులు లేదా వారసులు ధ్రువపత్రాలను తీసుకొచ్చి సమర్పించినా పరిశీలిస్తామని తెలిపారు. గ్రామాలు వారిగా హియరింగ్ తేదీలు, సెప్టెంబర్ 8, 9 : చుంచుపల్లి తండా, సెప్టెంబర్ 10, 11, 15 : విద్యానగర్ కాలనీ, సెప్టెంబర్ 16 : గరిమెళ్లపాడు, సెప్టెంబర్ 17 : 3-ఇంక్లైన్, సెప్టెంబర్ 18 : 4-ఇంక్లైన్, సెప్టెంబర్ 19 : గౌతంపూర్, సెప్టెంబర్ 22, 23, 24, 25 : రుద్రంపూర్, సెప్టెంబర్ 26, 29 : పెనగడప.

ఆయా తేదీల్లో సంబంధిత పంచాయతీ కార్యాలయాల్లో హియరింగ్ నిర్వహించనున్నట్లు తాసీల్దార్ తెలిపారు. నోటీసులు అందని



ఓటర్లకు కూడా హియరింగ్ తేదీన ఫోన్ ద్వారా సమాచారం అందించే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సంబంధిత ఓటర్లు తమకు కేటాయించిన తేదీన అవసరమైన ధ్రువపత్రాలతో ఆయా పంచాయతీ కార్యాలయాలకు హాజరై ప్రక్రియను పూర్తి చేసుకోవాలని నాగరాజు కోరారు.

# దళారి గుప్పిట్లో రైతు బతుకు.. పెట్టుబడిదారుల చేతిలో పంట!

**- ఆరు కాలాలు కష్టించిన అన్నదాతకు దక్కని గిట్టుబాటు ధర**

**- ఏజెన్సీ ప్రాంతాల్లో అప్పుల ఊబిలో రైతులు.. దళారి వ్యవస్థకు చరమగీతం పాడాలని డిమాండ్**

**కారేపల్లి, సెప్టెంబర్ 5(భద్రాద్రి న్యూస్ రాములు )** రైతే రాజు.. అన్నదాతే దేశానికి వెన్నెముక అని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం రైతు పరిస్థితి మారడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరు కాలాలు శ్రమించి పంట పండించిన రైతుకు గిట్టుబాటు ధర దక్కకపోగా, పంట చేతికొచ్చిన వెంటనే దళారులు, ప్రైవేట్ పెట్టుబడిదారుల చేతుల్లో చిక్కుకోవాల్సిన పరిస్థితి నెలకొందని సి.పి.ఐ. (ఎం.ఎల్.) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు శివనాయక్ ఆరోపించారు.

**పెట్టుబడి లేక.. ప్రైవేట్ అప్పే దిక్కు**

ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక మంది రైతులకు వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడి అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ పెట్టుబడిదారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోందని శివనాయక్ పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు వంటి సాగు వ్యయాలను భరించేందుకు అధిక వడ్డీలకు అప్పులు చేయడం వల్ల రైతులు అప్పుల చక్రంలో చిక్కుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ బ్యాంకుల నుంచి సకాలంలో రుణాలు అందకపోవడం, అర్హత ఉన్నప్పటికీ రుణ సదుపాయాలు అందుబాటులోకి రాకపోవడం రైతులను ప్రైవేట్ అప్పుల వైపు నెట్టే పరిస్థితిని కల్పిస్తోందని తెలిపారు.

**అప్పు ఇచ్చినవాడికే పంట.. ధర నిర్ణయించేది కూడా అతడే!**

పెట్టుబడి పెట్టిన వ్యక్తి వద్దే పంటను విక్రయించాలనే ఒత్తిడి కొన్ని ప్రాంతాల్లో రైతులపై ఉంటోందని శివనాయక్ ఆరోపించారు. మార్కెట్‌లో పంట ధర ఎంత ఉన్నా రైతు తనకు నచ్చిన మార్కెట్‌లో విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. రైతు పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసి, అదే పంటను మార్కెట్‌లో అధిక ధరకు విక్రయించడం ద్వారా మధ్యవర్తులు, పెట్టుబడిదారులు లాభపడుతున్నారని పేర్కొన్నారు. దీంతో రైతు సంవత్సరమంతా చేసిన కష్టం చివరకు అప్పు తీర్చడానికి కూడా సరిపోని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రకృతి దెబ్బ.. అప్పుల భారం రెట్టింపు**

వ్యవసాయం ప్రకృతిపై ఆధారపడటంతో వర్షాభావం, అధిక వర్షాలు, వరదలు, తెగుళ్లు వంటి కారణాలతో పంట నష్టపోతే రైతు పూర్తిగా నష్టపోతున్నాడని శివనాయక్ తెలిపారు. పంట పోయినా అప్పు మాత్రం వడ్డీతో సహా చెల్లించాల్సిన పరిస్థితి ఉంటోందన్నారు. పంట నష్టపోయిన రైతుకు సకాలంలో ప్రభుత్వ సహాయం అందకపోతే మళ్లీ అదే పెట్టుబడిదారుడి వద్ద అప్పు చేసి తదుపరి పంట సాగు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇలా ఏళ్ల తరబడి అప్పులు పెరుగుతూ రైతు కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టబడుతున్నాయని అన్నారు.



**ప్రతి మండల కేంద్రంలో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి :** రైతు పంటను వెంటనే తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి లేకుండా ప్రతి మండల కేంద్రంలో కనీసం రెండు శీతల గిడ్డంగులను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని శివనాయక్ డిమాండ్ చేశారు. రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని మార్కెట్‌లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించుకునేలా గిడ్డంగుల నిర్వహణలో రైతులకు ప్రధాన హక్కు కల్పించాలని కోరారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా మార్కెట్‌కు చేరుకునే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

**రైతు సహకార సంఘాలను బలోపేతం చేయాలి**

రైతు సహకార సంఘాలను బలోపేతం చేసి, రైతులు సమూహంగా తమ పంటలను మార్కెట్‌కు తీసుకెళ్లే అవకాశం కల్పించాలని శివనాయక్ కోరారు. దీంతో మధ్యవర్తుల ఆధిపత్యాన్ని తగ్గించి రైతుకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల సున్నా వడ్డీ రుణం**

ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.2 లక్షల వరకు ఎటువంటి షరతులు లేకుండా సున్నా వడ్డీ రుణం అందించాలని శివనాయక్ డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు బ్యాంకుల ద్వారా సకాలంలో రుణం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించాలని, పంట నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

**రైతులకు వ్యవసాయ అధికారుల అవగాహన ఏది?**

ప్రతి పంట సాగుకు ముందే వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని శివనాయక్ అన్నారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, పురుగు మందుల వాడకం, పంటల మార్కెట్ ధరలు, పంట నిల్వ, విక్రయ విధానాలపై రైతులకు నిరంతర అవగాహన కల్పించాలని కోరారు.

**దళారి వ్యవస్థకు చరమగీతం పాడాలి**

ఏజెన్సీ ప్రాంతాల్లో రైతులు పెట్టుబడిదారులపై ఆధారపడే పరిస్థితిని ప్రభుత్వం తక్షణమే మార్చాలని శివనాయక్ డిమాండ్ చేశారు. రైతు పండించిన ప్రతి గింజను తనకు నచ్చిన మార్కెట్‌లో, గిట్టుబాటు ధరకు స్వేచ్ఛగా విక్రయించుకునే హక్కును ప్రభుత్వం కల్పించాలని అన్నారు. దళారి వ్యవస్థను పూర్తిగా అరికట్టి.. రైతుకు మార్కెట్‌పై హక్కు కల్పించాలి. రైతు చేతిలోనే వ్యవసాయం ఉండేలా ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలి. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది.. రైతును కాపాడుకోవడం సమాజం మొత్తం బాధ్యతగా భావించాలని సి.పి.ఐ. (ఎం.ఎల్.) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు శివనాయక్ డిమాండ్ చేశారు.

## ప్రీ-ప్రైమరీ పాఠశాలలో మండల ఎంఈఓకు ఘన సన్మానం



**పాల్వంచ, సెప్టెంబర్ 5: భద్రాద్రిన్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బసవతార కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రీ-ప్రైమరీ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)కి ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బసవతార కాలనీ సర్పంచ్ జరుపుల కాశమ్మ, ఉప సర్పంచ్ చల్ల భాగ్యమ్మ, వార్డు సభ్యురాలు వాణి విద్య, గ్రామ పెద్ద అంకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరి సింగ్, ఉపాధ్యాయురాలు అలివేలు, ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి కలిసి ఎంఈఓను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయాలు, పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం విద్యాభివృద్ధికి ఎంఈఓ చేస్తున్న సేవలను పలువురు కొనియాడారు.

## మాస్టర్ మైండ్స్ కిడ్స్ స్కూల్‌లో అంగరంగ వైభవంగా 'ఉపాధ్యాయ దినోత్సవ' వేడుకలు



**పాల్వంచ ,సెప్టెంబర్ 5 (భద్రాద్రిన్యూస్ );** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురంలోని మాస్టర్ మైండ్స్ కిడ్స్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాల



ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ జి. రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ప్రత్యేక ఆకర్షణగా 'సెల్ఫ్ గవర్నమెంట్ డే':** విద్యార్థులకు ఉపాధ్యాయ వృత్తిపై గౌరవం, బాధ్యత పెరగాలనే ఉద్దేశంతో 'సెల్ఫ్ గవర్నమెంట్ డే' నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయుల రూపంలో (చీరలు, పంచెలు ధరించి) ముస్తాబై తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పడం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జి. రాజు మాట్లాడుతూ... "తల్లిదండ్రుల తర్వాత పిల్లల భవిష్యత్తును సరిగ్గా తీర్చిదిద్దేది గురువులే. మా మాస్టర్ మైండ్స్ స్కూల్ ఉపాధ్యాయులు తమ సొంత పిల్లల్లా భావించి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. వారి సేవలు మరువలేనివి" అని కొనియాడారు. అనంతరం పాఠశాలలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పూలతో, గ్రీటింగ్ కార్డులతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వంశీ , ఉపాధ్యాయులు కవిత , సమీరా , రాగమాల , గీత , పద్మ , లక్ష్మి శ్రావణి రేచల్ , సుప్రియ , అజయ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం



శ్రీ చైతన్య పాఠశాల **KGM** – 1 లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లికల్యాణి మేడమ్‌లి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. ఉపాధ్యాయులు కేవలం విద్యను మాత్రమే కాకుండా, మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికత మరియు బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తారని చెప్పారు. హైస్కూల్ కోఆర్డినేటర్ చెంచల బాబు సర్‌లి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి విజయానికి ఉపాధ్యాయుల కృషి, సహకారం మరియు ప్రోత్సాహం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయులను గౌరవించడం, వారి సూచనలను పాటించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలను స్మరించుకునే రోజే ఉపాధ్యాయ దినోత్సవమని వివరించారు. ప్రైమరీ కోఆర్డినేటర్ మాధవి మేడమ్‌లి మాట్లాడుతూ, చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రేమతో, సహనంతో విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారిలో మంచి ఆలోచనలు, మంచి అలవాట్లు మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఉపాధ్యాయుల ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సేవలను మరియు అంకితభావాన్ని అభినందించారు. విద్యార్థులు కూడా తమ ఉపాధ్యాయుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## జాతి నిర్మాణానికి ఉపాధ్యాయులు పునరంకితం కావాలి

**– అశ్వారావుపేట ఎమెల్యే జారే ఆదినారాయణ**

**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 05 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండలంలో డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



ఈ కార్యమానికి ముఖ్య అతిధిగా శాసన సభ్యులు జారె ఆదినారాయణ పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయిలో 21 మందిని, మండల స్థాయిలో 9 మందిని ఆయన శాలువా, మెమెంటో, సర్టిఫికెట్లతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు మాత్రమే ఈ సమాజాన్ని మార్చగలరని అందుకోసం వారు జాతి నిర్మాణం కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి లక్ష్మి రాజేశ్వరి, అన్నపురెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ లకావత్ లక్ష్మీ, ఉప సర్పంచ్ మారగని అశోక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంగోతు వెంకటేశ్వర్లు, మండల ప్రజా ప్రతినిధులు, వివిధ ఉపధ్యాయ సంఘ నాయకులు, మండల ఉపధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కొమురయ్య పోరాటాలు స్ఫూర్తిదాయకం

**– సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సలిగంటి శ్రీనివాస్**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 05 (భద్రాద్రి న్యూస్) :** మనుబోతుల కొమురయ్య ఇంటి పేరే యూనియన్ కొమురయ్యగా ప్రసిద్ధి చెందిందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సలిగంటి శ్రీనివాస్ అన్నారు. శనివారం రుద్రంపూర్‌లోని సీపీఐ కార్యాలయంలో కొమురయ్య 30వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ ద్వారా కొమురయ్య చేసిన కార్మిక పోరాటాలు ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయని, ఆయన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమానికి సీపీఐ రుద్రంపూర్ కార్యదర్శి, ఉపసర్పంచ్ తోట రాజకుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా నాయకులు వీరస్వామి, సుధాకర్, గట్టయ్య, రామచందర్ పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుంది

**– ఎంపీ వద్దిరాజు**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 05 (భద్రాద్రి న్యూస్) :** కాంగ్రెస్ సర్కార్ పై విద్యార్థులు సమరభేరి మోగించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. లక్ష్మీదేవిపల్లి మండలం మార్కెట్ యార్డు నుండి గణేష్ టెంపుల్ వరకు విద్యార్థులు. నిరుద్యోగులు ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏ ఒక్కరినీ వదలకుండా ప్రతి ఒక్కరికి అన్యాయం చేసిందన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికే ఉద్యోగ సంఘాలు కాంగ్రెస్ ప్రభుత్వం పై దుమ్మెత్తి పోస్తున్నాయని, ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ ఇవ్వకపోగా రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఇంతవరకు ఇవ్వకపోవడంతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కూడా చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీన ఉద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున హైదరాబాద్‌లో ఆందోళనకు సిద్ధమయ్యాయని, ఈ ఆందోళనకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు వహిస్తుందన్నారు. పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ఇప్పటికే 97 జిఓ తెర పైకి తీసుకువచ్చి పాలిటెక్నిక్ విద్యను శక్తి సంస్థకు అప్పగించాలని చూస్తుందన్నారు. పాలిటెక్నిక్ విద్యను శక్తికి అప్పగిస్తే బీఆర్ఎస్ ఉద్యమానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు సంకుబాపన అనుదీప్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్. భీమా శ్రీధర్. బండారి రుక్కు, బాదవత్ శాంతి, సోనా, మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు, పద్మ, మంజుల రాధ, నవతన్, శివ పాల్గొన్నారు.

## ఎస్సార్ ప్రైమ్ స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**కోదాడ సెప్టెంబర్ 5(భద్రాద్రి న్యూస్):** ఎస్సార్ ప్రైమ్ స్కూల్లో జోనల్ ఇన్చార్జ్ స్నేహలత ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువు లేనిదే జ్ఞానం లేదు జ్ఞానం లేనిదే అభివృద్ధి లేదని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ పటానికి పూలమాల వేసి, రాధాకృష్ణ గొప్పతనాన్ని తెలియజేశారు. ప్రతి యొక్క ఉపాధ్యాయుడు నిబద్ధతతో పని చేయాలన్నారు. ఉపాధ్యాయులు దేశ నిర్మాతలని కొనియాడారు. దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల యొక్క చేతిలో ఉందని అన్నారు. ప్రిన్సిపల్ పుల్లయ్య మాట్లాడుతూ ఎవరినైనా తయారు చేయగల శక్తి ఒక ఉపాధ్యాయునికే ఉందని అన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తు ఉపాధ్యాయుల మీద ఆధారపడి ఉందని అన్నారు. జీవితంలో తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులదే అన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిని సరియైన మార్గంలో నడిపే వారే ఉపాధ్యాయులు అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు,విద్యార్థిని, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

**– టీచర్స్ డే సందర్భంగా 40 మంది ఉపాధ్యాయులకు లయన్స్ క్లబ్ ఘన సన్మానం**



**దమ్మపేట, సెప్టెంబర్ 5 (భద్రాద్రి న్యూస్):** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అశ్వారావుపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వి.కె.డి.వి కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన సుమారు 40 మంది ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ శేషుబాబును వాసవి క్లబ్ జోన్ చైర్మన్, మహాత్మా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జల్లిపల్లి దేవరాజు శాలువాతో సన్మానించారు. గురుపూజోత్సవం ప్రాముఖ్యతను ఈ సందర్భంగా వివరించారు. అశ్వారావుపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్కినేని నరేంద్రబాబు, సెక్రటరీ బలమూరి సూర్యారావు, ట్రెజరర్ జూపల్లి బ్రహ్మారావు, సీనియర్ లయన్ సభ్యులు దారా మల్లికార్జునరావు, లయన్ అత్యం వెంకటేశ్వరరావు, యార్లగడ్డ ఈశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
ఆదివారం
6 । సెప్టెంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

## "ఉద్దీపకము"తో గిరిజన విద్యార్థుల్లో విద్యా వెలుగులు



**కారేపల్లి, సెప్టెంబర్ 5 (భద్రాద్రి న్యూస్ రాములు):** గిరిజన విద్యార్థులకు సులభమైన, వినూత్న బోధనా విధానాలను అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న సింగరేణి మండలం గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జి. శంకర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఐటీడీఏ పురస్కారం అందుకున్నారు. భద్రాచలం ఐటీడీఏలో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా "ఉద్దీపకము" పేరుతో పుస్తకాలను రూపొందించి, వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు శంకర్ చేస్తున్న కృషిని అధికారులు అభినందించారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి శంకర్‌ను అభినందించారు.

## వాణి వివేకానంద విద్యాలయం లో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం







**వైరా, సెప్టెంబర్ 5, ( భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ వాని వివేకానంద విద్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ముందుగా పాఠశాల కరస్పాండెంట్ చుండూరు కోటేశ్వరావు సార్ ప్రిన్సిపాల్ వాణి మేడం. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైనదని ప్రతి విద్యార్థిని చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పిస్తూ వారిని ఉన్నత శిఖరాల వైపు మళ్ళించడంలో ఉపాధ్యాయులు ప్రతినిత్యం కష్టపడతారని ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు చెడు సమాజంపై వెళ్లకుండా వారిని కాపాడుతూ ఉంటారని వారి సేవలు అభినందనీయమని కానీ ప్రస్తుత పరిస్థితుల్లో నేడు అదే ఉపాధ్యాయులపై విద్యార్థుల దాడులు సమాజంపై చెడు ప్రభావం చూపుతుందని అటువంటి విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండటానికి ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని వారు తెలిపారు. అనంతరం విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం విద్యార్థులచే సంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ గింజుపల్లి జనార్ధన్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో పారిశుధ్య కార్మికురాలు మృతి



**గుండాల, సెప్టెంబర్ 5, భద్రాద్రి న్యూస్:** గుండాల మండలంలోని సాయన పల్లి గ్రామపంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్ గా విధులు నిర్వహిస్తున్న అదే గ్రామానికి చెందిన బొమ్మెర లక్ష్మి శనివారం రోజు గుండెపోటుతో మరణిం చింది. గతంలో తన కొడుకు కూడా మరణించడంతో నిరుపేద కుటుంబం కావడంతో సాయనపల్లి గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికురాలిగా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది మరణించిన బొమ్మెర లక్ష్మి కుటుంబానికి ప్రభుత్వ సహాయంగా 15 లక్షలు చెల్లించాలని ౹ఖజ× గుండాల ఏరియా నాయకులు కోరం శాంతయ్య, బి .ఆర్.ఎస్ నాయకులు గడ్డం వీరన్న, టిడిపి నాయకులు ఇల్లెందుల నరసింహులు సిపిఐ నాయకులు షేక్ సాహెబ్ కోరుతూ మరణించిన లక్ష్మి కుటుంబానికి వారి బంధుమిత్రులకి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు.

## పాఠశాల సమగ్ర అభివృద్ధికి కృషి

### -- సపావత్ కిషన్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు ప్రదానం



**కామేపల్లి, సెప్టెంబరు 5 (భద్రాద్రి న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మంటత నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖలో విశిష్ట సేవలు అందించిన ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ యోగితా రానా, పాఠశాల విద్య సంచాలకులు నవీన్ నికోలస్ చేతుల మీదుగా కామేపల్లి మండలం టేకుల తండా గిరిజన సంక్షేమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సపవాట్ కిషన్ కు గుర్తించి ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని బహుమతిగా అందుకున్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల్లో విలువల పెంపు, విద్యా ప్రక్రియలో తల్లిదండ్రుల భాగస్వామ్యం, గ్రామాభివృద్ధిలో క్రియాశీల పాత్రతో పాటు జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్ట్‌లను సమర్థవంతంగా నిర్వహించినందుకు గాను ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. పురస్కార గ్రహీతకు ప్రశంసా పత్రంతో పాటు ?1,016 నగదు పరితోషికాన్ని అందించి అధికారులు ఘనంగా సత్కరించారు. నాణ్యమైన విద్యనందిస్తూ సమాజ వికాసానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయునికి ఈ గుర్తింపు దక్కడం పట్ల స్థానికులు, గ్రామ ప్రజలు వివిధ కుల సంఘాల నాయకులు ప్రజాప్రతి నిధులు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అధికారులు ఉపాధ్యాయల బృందం హర్షం వ్యక్తం చేశారు.

# ఏజెన్సీ ప్రాంతంలో 'పవర్ పెట్రోల్' మోత!

**- నార్మల్ పెట్రోల్ లేదంటూ పవర్ పెట్రోల్ విక్రయాలు.. వాహనదారులపై అదనపు భారం?**
**- అధికారుల నిర్లక్ష్యమా.. బంక్ యాజమాన్యం ఇష్టారాజ్యమా?**

**సింగరేణి, సెప్టెంబర్ 5,( భద్రాద్రి న్యూస్ రాములు ):** సింగరేణి మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో పెట్రోల్ విక్రయాలపై వాహనదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మండలంలోని వెంకట సాయి పెట్రోల్ బంక్‌లో నార్మల్ పెట్రోల్ అందుబాటులో లేదంటూ పవర్ పెట్రోల్‌నే విక్రయిస్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.నార్మల్ పెట్రోల్‌కు, పవర్ పెట్రోల్‌కు ధరలో సుమారు రూ.10 వరకు వ్యత్యాసం ఉంటుందని వాహనదారులు చెబుతున్నారు. నార్మల్ పెట్రోల్ కావాలని అడిగినప్పుడు అందుబాటులో లేదని చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధర కలిగిన పవర్ పెట్రోల్ కొనుగోలు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మేనేజర్ సమాధానంపై వినియోగదారుల అసంతృప్తి**

నార్మల్ పెట్రోల్ ఎందుకు అందుబాటులో లేదని బంక్ మేనేజర్‌ను ప్రశ్నించగా, స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా సేల్స్‌మెన్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారని వినియోగదారులు పేర్కొంటున్నారు. దీంతో నార్మల్ పెట్రోల్ సరఫరా, నిల్వలు, విక్రయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టాలి**

ఏజెన్సీ ప్రాంత ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వెంకట సాయి పెట్రోల్ బంక్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. నార్మల్ పెట్రోల్ ఎందుకు అందుబాటులో లేదో, పవర్ పెట్రోల్ విక్రయాలు ఏ విధంగా జరుగుతున్నాయో అధికారులు పరిశీలించి ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఫిర్యాదులపై సంబంధిత శాఖ




అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? లేక వినియోగదారులపై అదనపు భారం కొనసాగుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

# గురువుల సేవలకు ఘన వందనం..

**- బొక్కల తండాలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు!**
**- విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులే**
**- క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**

**కారేపల్లి, సెప్టెంబర్ 5 (భద్రాద్రి న్యూస్ రాములు ):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం భజ్య తండా గ్రామపంచాయతీ పరిధిలోని ఎంపీపీఎస్ బొక్కల తండా పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గురువుల సేవలను స్మరించుకుంటూ అభినందనలు తెలిపారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని కార్యక్రమంలో పేర్కొన్నారు. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల భవిష్యత్తుకు సరైన దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని తెలిపారు. విద్యార్థుల్లో విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో గురువుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గురువు చెప్పే ఒక్క మంచి మాట.. విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేయగలదని, ప్రతి విద్యార్థి తన గురువుల సూచనలు పాటిస్తూ



ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వాంకుడోత్ మంగీలాల్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు రజని, విద్యార్థులు కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

# సమ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే

**- విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర**
**- యూపీఎస్ పెద్దతండా ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

**సింగరేణి మండలం, సెప్టెంబర్ 5 (భద్రాద్రి న్యూస్ రాములు ):** సమాజాన్ని మంచిమార్గంలో నడిపిస్తూ బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భాగ్యనగర్ తండా పరిధిలోని యూపీఎస్ పెద్దతండా పాఠశాల ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం సర్పంచ్ బానోత్ హీరాలాల్ మాట్లాడుతూ.. తాను కరిగిపోతూ ఎంతో మందికి వెలుగులు పంచే దీపంలా ఉపాధ్యాయులు తమ జీవితాలను విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితం చేస్తున్నారని కొనియాడారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పుతూ మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు.ఒక విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుడి మార్గదర్శకత్వం ఎంతో కీలకమని,



విద్యార్థులు గురువుల సూచనలు పాటిస్తూ కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సర్పంచ్ ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి విద్యే పునాది అని, విద్యను అందించే ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వాంకుడోత్ గాంధీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వైరా అభివృద్ధిని చూసి మాట్లాడాలి

**- మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ**
**- గత పాలనలో పాలకులు ఏం చేశారో వైరా ప్రజలకు తెలుసు- చంద్రకళ**

**వైరా, సెప్టెంబర్ 5, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు శ్రీ మాలోత్ రాందాస్ నాయక్ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కేవలం 1000 రోజుల్లోనే వైరా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూడలేని బిఆర్ఎస్ నాయకులు రాజకీయ అక్కసుతో తప్పుడు ప్రచారం చేయటం సిగ్గుచేటని ఆమె తీవ్రంగా ఖండించారు. విమర్శలు చేసే ముందు గత పాలనలో వైరా మున్సిపాలిటీకి ఎన్ని నిధులు తీసుకొచ్చారు? ఎన్ని శాశ్వత ఈ పనులు చేపట్టారు? అనే విషయాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో దాదాపు రూ 400 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించటం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి సుమారు 200 కోట్లతో చర్యలు చేపట్టారని, వైరా పట్టణంలోని రింగ్రోడ్ సెంటర్ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి, వాణిజ్య అవసరాల కోసం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ 7.50 కోట రూపాయలు వెచ్చించడం జరిగిందని, వైరా పట్టణ సుందరీ కరణ, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి 52 కోట్లకు పైగా నిధులు తీసుకురావటం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభమై వైరా పట్టణ రూపురేఖలను మార్చనున్నాయని తెలిపారు. గత పాలకులు అభివృద్ధి చేశారంటే ఆధారాలు చూపాలి అని అన్నారు. కళ్ళుండి కూడా అభివృద్ధిని చూడలేని విధంగా గత పాలకులు వ్యవహరిస్తున్నారు. విమర్శలు చేయడం కాదు.. అభివృద్ధిని చూసి మాట్లాడాలి అని డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. గత పాలనలో వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి ఏం చేశారో ప్రజలకు చెప్పాలని, తాము చేస్తున్న అభివృద్ధిపై విమర్శలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం- ఇందిరమ్మ రాజ్యంలో వైరా మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యత తనపై ఉందని ఆమె స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో మార్పు వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా ప్రయోజనం అందుతుందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి 11వ ద్వారా అర్హులైన కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమానికి, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సహకారం అయిందని ఆమె అన్నారు. గత పాలకులు పేదలకు



ఇల్లు ఇస్తామని హామీలు ఇచ్చి, ఆచరణలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ సొంతింటి కలను సహకారం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల కళ్ళముందే కనిపిస్తున్నాయని, ఇవన్నీ చూసిన తర్వాత కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పై బురదజల్లే విధంగా తప్పుడు ప్రచారం చేయటం తగదని హితవు పలికారు. రాజకీయ విమర్శలు ఆరోగ్యకరంగా ఉండాలి కానీ ప్రజలకు జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునే విధంగా తప్పుడు ప్రచారం చేయటం సరికాదని, దాని మానుకోవాలని డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ సూచించారు. ఈ పత్రికా సమావేశంలో ఏఎంసి చైర్మన్ బాల గంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సేలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపమురళీకృష్ణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, కౌన్సిలర్లు తీరావత్ వెంకటేశ్వర్లు, మోర్ శ్రీకాంత్, రాజబంటి బలరామయ్య, నాయకులు డాక్టర్ ఉండు శ్యాంబాబు, కొల్లి రమేష్, తేలూరి వీరయ్య, బొడ్డు కృష్ణ, బత్తుల కొండలరావు, వన్నవరపు కొండలు, తోటకూర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**- వైరా మండల విద్యాశాఖ, మండల ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం**




**వైరా, సెప్టెంబర్ 5, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ మండల పరిషత్ సమావేశ మందిరంలో వైరా మండల విద్యాశాఖ, మండల ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మాన కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ విచ్చేసి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. గరికపాడు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఉపాధ్యాయుల ప్రాముఖ్యత, వారి శక్తి సామర్థ్యాలు, విద్యార్థుల భవిష్యత్తు, నిర్మాణంలో వారి పాత్ర, సమాజాభివృద్ధికి వారు అందిస్తున్న విశిష్ట సేవలు గురించి వివరించారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం బోధనకి పరిమితం కాకుండా, సమాజానికి మార్గనిర్దేశం చేసే మహోన్నత బాధ్యతతో కూడుకున్నదని కొనియాడారు. వైరా మండలంలోని ప్రతి కాంప్లెక్స్ నుండి ఐదుగురు చొప్పున మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపిక



చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల నుంచి 8 మంది గత సంవత్సర కాలంలో విశిష్ట సేవలు అందించి పదవి విరమణ చేసిన తొమ్మిది మంది ఉపాధ్యాయులను కూడా ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారి ప్రతిభను గౌరవిస్తూ నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం వైరా మండలంలో ఉపాధ్యాయ సమాజానికి మరింత స్ఫూర్తిని, ఉత్సాహాన్ని అందించింది.

# వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి అభినందనల వెల్లువ

**- గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలి**
**- గ్రామ సర్పంచ్ గుగులోత్ రమాదేవి రవి నాయక్**

**కామేపల్లి,సెప్టెంబర్ 5 (భద్రాద్రిన్యూస్):** మారుమూల ఏజెన్సీ గ్రామ నుండి ఎంబిబిఎస్ ర్యాంకు సాధించి మొదటి స్థానంలో నిలిచి సీటు దక్కించుకున్న విద్యార్థిని. ఖమ్మం జిల్లా ఇల్లెందు నియోజక వర్గం కామేపల్లి మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన రుక్కితండా గ్రామపంచాయతీ బండిపాడు గ్రామానికి చెందిన జాటోత్ సుక్కో -సునీత దంపతుల కుమార్తె వినిత వైద్య విద్యలో ప్రవేశం సాధించిన సందర్భంగా గ్రామంలో స్థానిక ప్రజలు ప్రజా ప్రతినిధులు కుల సంఘాలు అభినందనలు వెల్లువెత్తాయి వరంగల్.ఫాదర్ కొలంబోవైద్య కళాశాలలో ఎంబీబీఎస్ వైద్య విద్యను అభ్యసించేందుకు ప్రవేశం పొందిన వినీతను రుక్కీ తండా గ్రామ సర్పంచ్ గుగులోత్ రమాదేవి రవి నాయక్. పంచాయతీ సెక్రెటరీ పజల్.విఆర్ఓ కందయ్య కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి,ఇష్టపడి చదువుతూ ఉన్నత లక్ష్యాల వైపు దిశగా ముందుకు సాగాలని సూచించారు.వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పిల్లలను ఉన్నతం విద్య చదివించేందుకు కష్టపడుతున్న తల్లిదండ్రులు సూక్కో- సునీత దంపతులను సర్పంచ్ అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుంచి విద్యార్థులు ఉన్నత విద్యలో ంా ణ ి ం చ ం ం న ం తో ష క ర వ్ా న వి ష య ం వ ం ని పే ర్కొ న్నా ర ు. వి నీ త విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా దయకంగా నిలవాలని ఆకాంక్షించారు. వైద్య రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని వారు కోరుతూ ఆకాంక్షించారు.



# రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించకపోతే పోరుబాటకు సిద్ధం సిపిఎం పార్టీ డిమాండ్

**కామేపల్లి,సెప్టెంబర్ 5 (భద్రాద్రిన్యూస్):-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రజలు, రైతులు వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే ఊబిలో కురుక్కుపోయిన సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణా డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా'ఆల్ ఇండియా కిసాన్ రైతు మహాసభ'ను జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలకు మండలంలో రహదారులన్నీ కంకర తేలి గుంతలమయంగా మారాయని,నిత్యం ప్రయాణికులు కిందపడి గాయపడుతున్నారు.రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా సాదా బైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులైన రైతాంగాన్ని ఆదుకోవాలని, లేనిపక్షంలో బాధితులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కష్టకాలంలో వర్షాలు కురవక వ్యవసాయ కూలీలకు పనులు దొరకక వలస వెళు_న్నారని వారి సమస్యలను పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పని కల్పించి ఆదుకోవాలని అభిప్రాయపడ్డారు బిజెపి కేంద్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించి ఉపాధి హామీ పనులు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వింజం నాగభూషణం, మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బాదావత్ శ్రీను, ఆమంచి అంజయ్య, ఆడప్ప ఉపేందర్, ఏర్పుల శాంతయ్య, లావుడియా భావుసింగ్ తదితరులు పాల్గొన్నారు.



# స్మార్ట్ రేషన్ కార్డులు,కస్తూర్బా పాఠశాల వస్తువుల పంపిణీ

**- తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్ రెడ్డి చేతుల మీద పంపిణీ**





**కామేపల్లి,సెప్టెంబర్ 5(భద్రాద్రి న్యూస్):** ఖమ్మం జిల్లా ఇల్లెందు నియోజక వర్గం లోని కామేపల్లి మండలం పరిధిలోగల పాత లింగాల గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు,కస్తూరీబా పాఠశాల లో విద్యార్థులకు వస్తువుల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించడం జరిగింది.స్థానిక రైతు వేదికలో గ్రామస్థులకు స్మార్ట్ రేషన్ కార్డులను రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, ట్రంకుపెట్టెలు,ప్లేట్లు, గ్లాసులతో పాటు ఆటల పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జగన్నాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుజాత, పంచాయతీ సెక్రెటరీ అనిత,ఎస్ఓ స్వాతి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బందులు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులే విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకులు

**శ్రీ చైతన్య పాఠశాల కె.జి.ఎం --1లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**లక్ష్మీ దేవిపల్లి, సెప్టెంబర్ 5 (భద్రాద్రి న్యూస్):** శ్రీ చైతన్య పాఠశాల కె.జి.ఎం--1లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కల్యాణి మేడమ్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. ఉపాధ్యాయులు కేవలం విద్యను అందించడమే కాకుండా మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికత, బాధ్యతాయుతమైన జీవన విధానంపై విద్యార్థులకు మార్గదర్శకత్వం అందిస్తారని పేర్కొన్నారు. హైస్కూల్ కోఆర్డినేటర్ చెంచల బాబు సర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విజయానికి ఉపాధ్యాయుల కృషి, సహకారం, ప్రోత్సాహం ఎంతో ముఖ్యమని అన్నారు. ఉపాధ్యాయులను గౌరవించడం, వారి సూచనలను పాటించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను స్మరించుకునే రోజే ఉపాధ్యాయ దినోత్సవమని వివరించారు. ప్రైమరీ కోఆర్డినేటర్ మాధవి మేడమ్ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. ప్రేమ, సహనం, ఆప్యాయతతో విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారిలో మంచి ఆలోచనలు, అలవాట్లు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఉపాధ్యాయుల ప్రధాన లక్ష్యమని చెప్పారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవలను, అంకితభావాన్ని అభినందించారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫొటో క్యాప్షన్: శ్రీ చైతన్య పాఠశాల కె.జి.ఎం--1లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు.







# డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ స్కూల్ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**గోకుల్ ప్లాట్స్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం: 'జ్ఞానానికి మూలం ప్రశ్నించే తత్వమే' డా. నూకారపు శ్రీనివాస్**

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 5,:**

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడమే నిజమైన విద్య అని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. నూకారపు శ్రీనివాస్ అన్నారు. వెంకట్రామణ కాలనీ, గోకుల్ ప్లాట్స్ లోని 'డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ' ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఎంతటి ఉన్నత స్థాయికి ఎదిగినా సొంత మూలాలను, వృత్తిని విస్మరించకూడదని ఆయన జీవితం మనకు నేర్పుతుందని గుర్తుచేశారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఉపాధ్యాయులు సైతం నిరంతర విద్యార్థులుగా ఉంటూ నూతన విషయాలను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులదేనని సమాజాన్ని, గురువులను గౌరవించే సంస్కృతిని పిల్లల్లో పెంపొందించాలని సూచించారు. విద్యార్థులు ఎక్కడి నుంచి వచ్చారనేది ముఖ్యం కాదని, ఎక్కడికి వెళ్లాలనే లక్ష్యమే ప్రధానమని స్పష్టం చేశారు. ఐఏఎస్, డాక్టర్, ఇంజనీర్ వంటి ఉన్నత ఆశయాలను ఎంచుకుని, సాధించే వరకు నిరంతరం శ్రమించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల్లో సొసైటీ వ్యవస్థాపకురాలు చావా అరుణ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 22-ఏ నిషేధిత భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**ఇంద్రాపార్క్ వద్ద బీజేపీ మహా దీక్షకు కూకట్‌పల్లి నుంచి భారీగా తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు**

**రైతుల భూములపై అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం: వడ్డేపల్లి రాజేశ్వరరావు**

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 5:**

22-ఏ నిషేధిత భూముల జాబితా నుంచి రైతులు, సామాన్య ప్రజలకు చెందిన భూములను తొలగించి వారికి న్యాయం చేయాలని, భూ భారతి పోర్టల్‌లో నెలకొన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో ఇంద్రాపార్క్ వద్ద నిర్వహించిన మహా దీక్షకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు బైక్‌లు, కార్లతో భారీ ర్యాలీగా ఇంద్రాపార్క్‌కు చేరుకుని మహా దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. రైతులు, సామాన్యుల భూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో రైతులు, సామాన్యులకు చెందిన భూములు ఉండటంతో వారు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు హక్కులు ఉన్నప్పటికీ భూములను విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని తెలిపారు. రైతుల భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించి, వారికి సంపూర్ణ హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారు పేర్కొన్నారు. అలాగే భూ భారతి పోర్టల్‌లో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను తక్షణమే పరిష్కరించి, భూ సంబంధిత సేవలను రైతులకు సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితిని తొలగించి, పారదర్శకంగా, వేగంగా పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. "రైతులు, సామాన్యుల భూముల విషయంలో ఎలాంటి అన్యాయం జరిగినా బీజేపీ చూస్తూ ఊరుకోదు. రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాడుతుంది. 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని స్పష్టం చేశారు.ఈ మహా దీక్షలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళా నాయకులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.



# ఆదివాసి ముద్దుబిడ్డ శిరీష హత్య అత్యంత హేయం

**- నిందితులను కఠినంగా శిక్షించాలి.**
**- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి.**
**- మహిళల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి**
**- మహిళ సమాఖ్య భద్రాద్రి జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి**

**కొత్తగూడెం టౌన్ , సెప్టెంబర్ 5 (భద్రాద్రిన్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గిరిజన యువతి (నర్సు) హైదరాబాద్ శివారు ప్రాంతంలో దారుణ హత్యకు గురికావడం అత్యంత హేయమైన చర్య అని, ఈ అమానుష ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామని సిపిఐ అనుబంధ ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి అన్నారు. ఈ ఘటనపై అమె మాట్లాడుతూ ఉపాధి కోసం వెళ్లి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పరిధిలోని తుక్కుగూడలో నర్సుగా సేవలందిస్తున్న గిరిజన బిడ్డపై దుండగులు పాశవికంగా దాడి చేసి హత్య చేయడం తీవ్రంగా కలచివేసిందన్నారు. మహిళలపై ఇలాంటి పైశాచిక దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ హత్యోదంతంపై సమగ్ర దర్యాప్తు వేగవంతం చేసి, బాధ్యులైన నిందితులను గుర్తించి ఫాస్ట్‌ట్రక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రి వద్ద గిరిజన, ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలుపుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, అన్ని విధాలా న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో మున్నా లక్ష్మికుమారి, కరిష రత్న కుమారి, షైక్ షాహిన్, కైసార్, దారా లక్ష్మి,రమాదేవి, పాల్గున్నారు.




# అంజయ్య నగర్ డివిజన్‌లో స్ట్రీట్ లైట్ల సమస్య పరిష్కరించాలి: డిప్యూటీ కమిషనర్‌కు వినతి

**శేరిలింగంపల్లి : సెప్టెంబరు 5,**

అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో వెంటనే స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ డిమాండ్ చేశారు. డివిజన్ నాయకులతో కలిసి ఆయన సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణను వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ అంజయ్య నగర్, సిద్దిక్ నగర్, రాజీవ్ నగర్, బంజారా నగర్, గుల్షన్ నగర్ తదితర కాలనీల్లో స్ట్రీట్ లైట్ల సమస్య తీవ్రంగా ఉ ఒదన్నారు. గతంలో చేసిన ఫిర్యాదుల మేరకు కొన్ని చోట్ల లైట్లు అమర్చడంతో ఉపశమనం లభించినప్పటికీ, ఇప్పటికీ అనేక ప్రాంతాలు రాత్రి వేళల్లో చీకట్లోనే మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చీకటిని ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు పెరిగే ప్రమాదం ఉందని రాత్రి వేళల్లో మహిళలు, వృద్ధులు బయటకు రావాలంటే తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజా భద్రతను దృష్టిలో ఉ ంచుకుని లైట్లు లేని ప్రదేశాల్లో వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. వినతిపత్రంపై డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ సానుకూలంగా స్పందిస్తూ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించి మిగిలిన అన్ని వీధుల్లో వీధిదీపాల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, రాము యాదవ్, రాజేందర్ రెడ్డి, భీముడు, సంతోష్, రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.




మాదాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రం అందిస్తున్న అంజయ్య నగర్ డివిజన్ నాయకులు..

# మణుగూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం

**మణుగూరు (సెప్టెంబర్ 05) ( భద్రాద్రిన్యూస్ ):** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బండారుగూడెం యుపిఎస్ పాఠశాల ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్ మాట్లాడుతూ... సమాజంలో ఉపాధ్యాయవృత్తి ఎంతో పవిత్రమైనదని నవ సమాజ రూపశిల్పులు ఉపాధ్యాయులే అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆద ర్శంగా తీసుకుని, అంకితభావంతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. సమాజానికి మంచి పౌరులను అందించాలన్నారు. అనంతరం హెచ్ ఎం సావిత్రి, ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ ముఖ్యులు బండారు నర్సింహారావు, కడవెండి విశ్వనాథ గుప్తా, చిత్తలూరి రమేష్ బాబు, దింటకుర్తి బ్రహ్మయ్య, సముద్రాల కిషోర్, సుగ్గల సూర్యం, కొల్లూరి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.





Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046